# రోడ్డుమీద గులాబి

రోడ్డుమీద గులాబి !

అలా అనొచ్చా! ఇప్పుడా మీమాంస దేనికి? ఎఱ్ఱగా విచ్చుకొని, అరచేతి వెడల్పుగల ఆ గోడమీద నిలబడి.... అవునూ... గులాబి నిలబడడం ఏమిటి? తేక వాలిందా? అదే సరయిందేమో! ఈ గులాబి గురించి ఏం రాయాలన్నా నాకు సంశయం కలుగుతోంది.

అహర్నిశలూ, లారీలూ, కార్లూ, స్కూటర్లూ, విరజిమ్ముతున్న కాలుష్యాన్ని తట్టుకుంటూ జనారణ్యం నడుమ ఆ గులాబి !

గులాబి అందంగా ఉంటుంది. అది ఏ తోటలలో తమ జాతి పుష్పాల నీడలో ఉన్నా, ఏ పాలరాతి భవనపు ముంగిట్లో అప్పుడే విచ్చుకుంటున్నా, మొగ్గయినా, ముగ్ధయినా ఆ అందమే అందం !

అలాంటిది హిపోక్రటిక్ జీవితాల్ని కాళ్ళారా చూడటానికి తనుంటే...

కొన్ని జతల కళ్ళు తదేకంగా చూస్తుంటే.... మరుక్షణం అవసరాల ముల్లు గుచ్చుకుంటుంటే, ముందుకు కదలటం! గులాబి నవ్వుల్ని చూస్తుంటే ఎంతగా అనుభూతి కలుగుతుందో....

తనవంకే చూస్తూ స్కూటర్ నడుపుతుంటే పెద్ద శబ్దం.... ఎఱ్ఱగా రక్తం కాల్వలే.... అయినా గులాబి రెపరెపలే! ఇంకెంత సేపు? నీ జీవితకాలం కేవలం ఇరవై నాలుగు గంటలు !

అయినా ఈ గులాబి సృష్టించే కల్లోలం సామాన్యమా ?

గులాబి వయసెంత? ఏమో ఎవరు చెబుతారు. గులాబిని నిన్న ప్రేమించారు. నేడు ఆరాధిస్తున్నారు. రేపు అనుభవిస్తారు. పాత, కొత్తల, మేలికలయికను ప్రతిబింబించే ఈ గులాబి ఆధునిక జీవితానికి సైతం అందంగా నిలబడటం ఏమిటి ?!

ఆ భవనం ముఖం రోడ్డుమీదకు.... ఆ వరండాలో కేవలం ఇద్దరు మాత్రమే నిలబడొచ్చు. అక్కడ ఓ చిన్న కుండీలో ముళ్ళ మాటున ఎదిగి విచ్చుకొన్న ఆ గులాబిని చేతుల్తో ఎత్తిపెట్టి, అలా దేశం మీదకు ప్రదర్శించటంలో ఏమై ఉంటుంది వారి ఆలోచన ?

ఆ భవనపు విలువలు అంతస్థును చాటుతున్నాయే! మరయితే ఆ గులాబిని అలా ఉంచడానికి కారణం, జనమంతా ఆ అందాల్ని ఆస్వాదించాలనేనా ? అంత విశాల హృదయంతో వారుంచినా ఎందరెందరు ఆ ప్రాంగణంలో మనసు పారేసుకున్నారు! నేను అలానే నిలబడి చూస్తుంటే పిచ్చివాడనుకోవడం లేదు కదా ? గులాబీ నువ్వెంత పని చేస్తున్నావ్ ?!

తలుపులు మాత్రం మూసేసి గులాబీ అందాల్ని జనానికి వదిలిన వారి సౌశీల్యం గురించి నా మిత్రుడు పొగడుతుంటే....వారి గ్యారేజ్‌లో నిగనిగలాడుతున్న కారు గురించి.... మినీ స్కర్టులో.... బొచ్చు కుక్క పిల్లతో టీవీ చూస్తున్న రంగుల బొమ్మను తలచుకొని 'ఈ రోజా కంటే ఆ "రోజా"నే బాగుందన్న' వాడి మాటలకు....

సౌందర్యానికి కొలబద్ద ఏమిటి? వీక్షించడంలో ఎవడికుండే దృక్పథం వాడిది. వాడికి గులాబి అందంకన్నా! గులాబిలాంటి పిల్లే ఎక్కువ. అయినా చెలం అన్నట్లు 'సముద్ర తీరాల్ని, కొండల సౌందర్యాన్ని ఈ గులాబిని ఆరాధించలేని జడుడు.... కేవలం వీడి చూపు అంగాల మీదే.

నన్ను ముల్లు గుచ్చుతూంది. కాలం కదిలిస్తూంటే విడవలేక ఆ గులాబిని దాటి ముందు కెళ్ళాను.

అంగట్లో గులాబీలు ఎన్నెన్ని కనిపించలేదు. అయినా ఆ ఆకర్షణ రాలేదెందుకు? అది గొప్పవాళ్ల నీడలో ఉండడమూ? ఏకాంతంగా పరవశించడమా? ఏమోగాని ఈ వార్త తెలిశాక ఏమనుకోవాలో అర్థం కాకుండా ఉందే !

ఆ ఎర్రటి అందం చూసి, చూసి, మైమరచి, పిచ్చెత్తి, పరిగెత్తి, మెల్లగా గోడదూకి, చకచకా గోడపాకి, ఆ గులాబి పువ్వును కోసిన ఆ చేతిలో కస్సున దిగిన ముల్లు.... మెల్లగా మొదలైన ఎర్రటి చుక్కలు....!

ధనాలున తెరచుకున్న తలుపు.... కెవ్వున ఓ ముద్దరాలి కేక.... భౌ....భౌ....మంటున్న కుక్క.... రింగవుతున్న ఫోన్ చప్పుడు.... చేతిలోవున్న గులాబీని పెదవుల దగ్గరకు చేరుస్తున్న ఆ పిల్లవాడు.... ఆ మొరటోడు.... మరికొంచెం సేపట్లో.... ఎర్ర గులాబీని స్వంతం చేసుకోబోతున్న ఆ దొంగ.... ఎర్రటోపీల హస్తాల్లో....లాఠీ కర్రల్తో....

గులాబీ! గులాబీ! ఎంత పనిచేసావ్ గులాబీ!

....'నా గులాబీని విరిచిన ఆ దుర్మార్గుడు.... బ్యూటీని ఆరాధించలేని ఆ స్కౌండ్రల్....బ్రూట్.... ఐ హేట్ దట్ బ్లడీ...' కళ్ళవెంట నీళ్లు రాలుస్తున్న గులాబిని.

...."కంట్రోల్ బేబీ....కంట్రోల్.... రోడ్డు మీదకు గులాబుల్ని వదిలేస్తే ఈ మూర్ఖులంతే. వీళ్ళు క్రియేటర్సు కాదు, డిస్ట్రాయర్స్. ఈ దేశంలో ఆస్తుల్తోపాటు అందాల్ని దాచుకోవాలమ్మా. ఈ దేశపు ప్రధానమంత్రికే రక్షణలేదు. గులాబి కేముంది? ఓదారుస్తున్న 'పప్పా'.

ఇప్పుడేం రాయను ? !

గులాబి రెక్కలు తెగిపడుందనా ?

మనసయిన దానికోసం తెగించిన ఆ కుర్రవాణ్ణి అభినందిస్తూనా ? అభిశంసిస్తూనా? మీరే చెప్పాలి.

ఈ రోడ్డుమీద గులాబికి ముగింపేమిటి ?

—ఉదయం వారపత్రిక.